ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



చిత్తూరు
జిల్లా వార్తలు

సోమవారం 29 జనవరి 2024



అక్రమాలన్నీ మీరు చేసి నిందలు నాపైనా?

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

వైసీపీలో తీవ్ర దుమారం

మంత్రి ప్రాబల్యానికి ఎదురుదెబ్బ

పెద్దిరెడ్డిపై తిరుగుబాటు



కుమారుడు సుమన్‌తో కలిసి మాట్లాడుతున్న ఆదిమూలం

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధిపత్యానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పార్టీకి చెందిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం చేసిన తిరుగుబాటు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. ప్రత్యేకించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. తిరుపతి, చంద్రగిరి వంటి ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ సొంత వర్గాన్ని పెట్టుకుని పార్టీపై పెత్తనం చెలాయిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి వర్గాన్ని ఆదిమూలం తిరుగుబాటు కలవరపాటుకు గురి చేసింది. కొంత వెనక్కి వెళితే.. 2014లో వైసీపీ తరఫున పలమనేరు, తంబళ్లపల్లె సెగ్మెంట్ల నుంచీ పోటీ చేసిన అమరనాథరెడ్డి, ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి వర్గంతో సర్దుబాటు కాలేకనే పార్టీని వీడారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. తిరుపతి, చంద్రగిరి మినహా మిగిలిన అన్ని సెగ్మెంట్లలోనూ అభ్యర్థుల ఎంపికలో పెద్దిరెడ్డి సిఫారసే కీలకం అన్న సంగతి బహిరంగ రహస్యమే. ప్రస్తుతానికొస్తే నగరిలో మంత్రి రోజా, జీడీనెల్లూరులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైతం వారి సొంత నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వారి వ్యతిరేక వర్గాలు పెద్దిరెడ్డిని ఆశ్రయించుకుని పనులు చేసుకుంటున్నాయన్నది కూడా పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా రోజా నియోజకవర్గంలో ఆమె వ్యతిరేకులు ఆమెను కాదని కీలక పదవులు పొందడం వెనుక పెద్దిరెడ్డి సిఫారసు ఉందన్న ప్రచారం ఉంది. తాజాగా టికెట్ల విషయానికొస్తే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ వద్దని పలువురు పెద్దిరెడ్డిని కలసి ఫిర్యాదు చేయడం తెలిసిందే. అలాగే సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలాన్ని వద్దంటున్న వర్గం కూడా ఆయన్నే ఆశ్రయించడమూ కొత్తకాదు. మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైన సందర్భంలో కూడా ఆయన పెద్దిరెడ్డి పైనే అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ గల్లంతైనప్పుడు కూడా ఆయన నేరుగా పెద్దిరెడ్డిపైనే ఆరోపణలు చేశారు. తర్వాత మళ్లీ క్షమాపణలు చెప్పారు. ఇవన్నీ ఉమ్మడి జిల్లా వైసీపీ వ్యవహారాల్లో పెద్దిరెడ్డి జోక్యాన్ని తెలిపే ఉదంతాలే. కాకపోతే ఇప్పటి వరకూ ఎవరూ పెద్దిరెడ్డిపై ఆదిమూలం స్థాయిలో తీవ్ర ఆరోపణలు చేసింది లేదు. లోలోపల బాధపడడం, నిష్ఠూరం చేయడం తప్పితే బాహాటంగా వ్యతిరేకించింది లేదు. తాజా పరిణామాలతో ఆదిమూలం పెద్దిరెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతోపాటు అవినీతి ఆరోపణలు కూడా చేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కారణం నేరుగా పెద్దిరెడ్డేనంటూ ఆరోపించారు. వీటన్నింటికీ మించి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి పెత్తనమేమిటన్న ప్రశ్న దళిత సామాజికవర్గాలను సూటిగా తాకింది. క్రమేపీ విద్యావంతులవుతూ చైతన్యవంతంగా మారుతున్న ఆ వర్గాలను ఆదిమూలం ప్రశ్న అమాంతం కదిలించిందనే చెప్పాలి. వాస్తవంగా కూడా వైసీపీకి సంబంధించి జిల్లాలో ప్రతి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమూ డిస్టర్బ్ అయింది. టికెట్ గల్లంతు కావడమో, లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీ కావడమో జరిగింది. దీంతో ఈ అంశం జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇతర నియోజకవర్గాల్లో డిస్టర్బ్ అయిన వారు కూడా ఆదిమూలం చొరవకు లోలోపల సంతోషిస్తున్నట్టు సమాచారం. తాము చేయలేని పని ఆయన చేశారని కితాబిస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీలో ఎస్సీలకు తగిన గౌరవం లేదని ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేయడం, కళ్లెదుట ఆ వాస్తవం కనిపిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా దళిత సామాజికవర్గాలు ఆలోచనలో పడుతున్నాయి.

> 1989లో నేను మాజీ మంత్రి చెంగారెడ్డి వద్ద ఉన్నపుడు పెద్దిరెడ్డి మోటర్ సైకిల్‌పై తిరిగేవారు. ఇపుడు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి?

> సత్యవేడులో ఇసుక, గ్రావెల్ అక్రమ దందాలన్నీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే జరిగాయి. చెక్‌పోస్టుల్లో మనుషులను పెట్టి డబ్బు సంపాదించుకున్నది వాళ్లు. కానీ చెడ్డపేరు మాత్రం నాకు ఆపాదించారు.

> ఎమ్మెల్యేగా నాకింకా 80 రోజుల సమయం ఉంది. నాకు తెలియకుండా సత్యవేడు నియోజకవర్గ సమావేశాన్ని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో ఎలా నిర్వహిస్తారు? ఇలా శ్రీకాళహస్తి, నగరి, తిరుపతి నియోజకవర్గాల మీటింగులను మీ ఇంట్లో పెట్టగలిగే దమ్ముందా? అసలు ఎస్సీ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి? శ్రీకాళహస్తి, చెవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రోజా నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా?

> నా నియోజకవర్గంలో 33 రోడ్ల పనులను పెద్దిరెడ్డి కాంట్రాక్టు తీసుకుని ఒక్కటీ పూర్తి చేయలేదు. నాకు తెలియకుండా క్వారీలకు అనుమతులు ఇచ్చారు.

వీరిపై చర్యలు తీసుకునే ధైర్యముందా?

- ఆదిమూలం ప్రశ్నలకు ఎవరు జవాబు చెబుతారు
- టీడీపీ నేత నరసింహయాదవ్

'మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని మంత్రి రోజా రూ.40 లక్షలు తీసుకున్నారని వైసీపీకే చెందిన కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపించారు. మరి, ఆమెను పదవి నుంచి బర్తరఫ్ చేసే ధైర్యం మీకుందా? నిత్యం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమాయలు పత్రికల్లో వస్తున్నాయి. ఆయనపై చర్యలు తీసుకోగలరా? అంతెందుకు పాపాల భైరవుడు పెద్దిరెడ్డి రూ.35 వేల కోట్ల సహజ వనరుల ద్వారా దోచింది నిజం కాదా? ఆయనకు టికెట్ నిరాకరించే శక్తి జగన్‌కి ఉందా' అని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రశ్నించారు. పిచ్చాటూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల వారికి మాత్రం వారసులను ప్రకటించి దళితులకు టికెట్ లేదని కరాకండిగా చెప్పడం ఏ సామాజిక న్యాయమని నిలదీశారు. సత్యవేడు నియోజకవర్గంలో రోజుకు 200 టిప్పర్ల ఇసుక తరలించి లూటీ చేసింది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అయితే.. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన ఆదిమూలంపై మీ జులుం ప్రదర్శించడం ఏంటన్నారు. 'సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అడుగుతున్న ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు? సజ్జలా.. సాయిరెడ్డా.. పెద్దిరెడ్డా.. ఆఖరికి జగనా' అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ దుర్బుద్ధిని ప్రజలు గ్రహించాలని కోరారు.

- పిచ్చాటూరు

లోపాయికారి ఒప్పందంతోనే నిందలు: ఎంపీ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వేరేపార్టీవాళ్లతో చేతులు కలిపి నిందలు వేస్తున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆదివారం విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిపై ఆయన వ్యాఖ్యలు సరికాదన్నారు. వైసీపీలో ఎస్సీలకు గౌరవంలేదని ఆయన చెప్పడం బాధాకరమన్నారు. దళితులకు ప్రాధాన్యం ఉన్నందునే ఆదిమూలానికి ప్రమోషన్ ఇచ్చి ఎంపీగా పోటీచేసే అవకాశం పార్టీ కల్పించిందన్నారు. ఎంపీ స్థానం పట్ల ఇష్టంలేకపోతే అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసుకోవాలేగానీ, ఇలా రోడ్డుకెక్కడం సరికాదన్నారు. క్రమశిక్షణ చర్యలపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ప్రాజెక్టులను అటకెక్కించిన జగన్





పీసీసీ చీఫ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు

సమావేశంలో ప్రసంగిస్తున్న షర్మిల

- మన్నవరం, హంద్రీ-నీవా, గాలేరు-నగరిని పట్టించుకోని ప్రభుత్వం
- వీటిని పూర్తి చేయని వ్యక్తి వైఎస్ వారసుడెలా అవుతాడు
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ జగనన్న ప్రభుత్వం అటకెక్కించిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. తిరుపతిలోని రామతులసి కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ద్వారా బీహెచ్‌ఈఎల్, ఎన్‌టీపీసీ సంయుక్త భాగస్వామ్యంలో రూ.6వేల కోట్ల మన్నవరం ప్రాజెక్టును ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంజూరు చేయించారని గుర్తుచేశారు. అప్పట్లో రూ.వంద కోట్లు మంజూరు చేసి, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిశ్రమ అటకెక్కిందన్నారు. దీనికోసం జగనన్న ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే హంద్రీ-నీవా ప్రాజెక్టును వైఎస్ రూ.4500 కోట్లు ఖర్చు చేసి.. 90 శాతం పనులు పూర్తి చేయించారన్నారు. పది శాతం పెండింగ్ పనులను చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేసిన నాటి ప్రతిపక్ష నేత.. తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేయిస్తానన్నారని గుర్తు చేశారు. ఆయన సీఎం అయి 60 నెలలు గడుస్తున్నా 10 శాతం పనులను పూర్తి చేయలేకపోయారన్నారు. గాలేరు- నగరి ప్రాజెక్టునూ ప్రభుత్వం అటకెక్కించేసిందన్నారు. ఇలా ప్రాజెక్టులు అటకెక్కించిన జగనన్నకు.. రాయలసీమ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉందంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. వైఎస్ ప్రాజెక్టులను పూర్తి చేయనివారు ఆయన వారసులెలా అవుతారని నిలదీశారు. వైఎస్ మాట మీద నిలబడే నాయకుడైతే.. జగన్ మాత్రం మాట తప్పే వారని ధ్వజమెత్తారు. జగనన్న ప్రభుత్వం అదనంగా ఒక్క ఎకరాకైనా నీళ్లిచ్చిందా అని షర్మిల ప్రశ్నించారు. వైఎస్ పాలనకు, జగన్ పాలనకు ఆకాశానికి పాతాళానికీ ఉన్నంత తేడా లేదా? అని పార్టీ శ్రేణులను అడిగారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని రోజువారీ లక్ష్యం నిర్దేశించుకుని ప్రతి ఇంటినీ, ప్రతి మనిషినీ, ప్రతి వర్గాన్నీ కలిసేందుకు ప్రయత్నించాలని కార్యకర్తలను కోరారు. వైసీపీ, టీడీపీలను గెలిపిస్తే బీజేపీకి ఓటు వేసినట్టే అని ప్రజలకు చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ గెలిస్తేనే రాష్ట్రానికి విభజన హామీలు నెరవేరుతాయని గట్టిగా చెప్పాలన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీని, ఆ పార్టీకి బానిసలుగా మారిన టీడీపీ, వైసీపీని ఎండగట్టాలని పిలుపిచ్చారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు టిక్కీ రాయల్, డీసీసీ అధ్యక్షుడు భాస్కర్ ప్రసంగించగా.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, కంచన వేణుగోపాల్ రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నేత మద్దెల అమృతతేజ తదితరులు పాల్గొన్నారు. రెండు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి తరలివచ్చారు.

పట్టీ నాదంటే నాదే అంటూ వాగ్వాదం





దామరకుప్పంలో జల్లికట్టు

వెదురుకుప్పం, జనవరి 28: సంక్రాంతి ముగిసినా వెదురుకుప్పం మండలంలో జల్లికట్టు కొనసాగుతూనే ఉంది. ఆదివారం దామరకుప్పంలో జల్లికట్టు నిర్వహించారు. ఈ జల్లికట్టుకు అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి గిత్తలను తీసుకొచ్చిన యజమానులు.. వాటికి కొమ్ములకు రంగులు దిద్ది.. బహుమతులుగా పట్టీలు కట్టారు. అల్లిలో అప్పటికే పశువులను ఆపే ప్రయత్నంలో ఉన్న వారి వైపు గిత్తలను వదిలారు. వీటిని ఆపే ప్రయత్నంలో యువకులు వాటి కింద పడ్డారు. కొందరు గాయపడ్డారు. పట్టీలను సొంతం చేసుకునే క్రమంలో గిత్తలతో కుస్తీ పట్టారు. జల్లికట్టు నిర్వహణతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



గిత్తను పట్టేశానోచ్



సై అంటే సై

స్తంభించిన రిజిస్ట్రేషన్లు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 28: చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలుగు రోజులుగా భూములు, ఇంటి స్థలాల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సాంకేతిక లోపంతో ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో కక్షిదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. విక్రయించిన భూములకు డబ్బులు రాక, ఎప్పుడు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందో తెలియక పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి వర్షన్ అప్‌డేట్‌కు అమరావతిలోని రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేపడుతుండటంతో రోజులో కొన్ని గంటల పాటు సర్వర్ డౌన్ అవుతోందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల రూ.లక్షల్లో క్రయవిక్రయాలు నిలిచిపోతున్నాయని అంటున్నారు. సోమవారం నాటికైనా సమస్యను పరిష్కరించాలని కక్షిదారులు కోరుతున్నారు.

తెలుగు రైతు నేత 'పాచిగుంట' మృతి

గంగాధరనెల్లూరు, జనవరి 28: తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్‌నాయుడు ఆదివారం సాయంత్రం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించడంతో వెంటనే కుటుంబీకులు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఈయనది గంగాధరనెల్లూరు మండలం పాచిగుంట గ్రామం. ఈయన తండ్రి పొదిలి సహదేవ నాయుడు గంగాధరనెల్లూరు సమితి మాజీ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన కాంగ్రెస్‌పార్టీలో కొనసాగారు. ఈయన కుమారుడు పాచిగుంట మనోహర్‌నాయుడు (పి.ఎస్.మనోహర్‌నాయుడు) కూడా కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి.. అప్పటి మంత్రి చంద్రబాబునాయుడు, మాజీ ఎంపీ జ్ఞానేంద్రరెడ్డి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు. అనంతరం తన తండ్రితో కలిసి టీడీపీలో చేరారు. తూగుండ్రం సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడిగా, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడిగా, జిల్లా తెలుగురైతు అధ్యక్షుడిగా, చిత్తూరు చక్కెరఫ్యాక్టరీ కేన్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. వేపంజేరి, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో టీడీపీలో ప్రధాన నేతగా గుర్తింపు పొందారు. 15 ఏళ్ల కిందట ఈయన కుమార్తె వివాహానికి హాజరు కాలేకపోయిన చంద్రబాబు నాయుడు.. అనంతరం పాచిగుంటకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. నటుడు మోహన్‌బాబుతో ఉన్న సాన్నిహిత్యంతో 'మాఇంటి కథ, రౌడీగారిపెళ్ళాం, అసెంబ్లీరౌడీ' సినిమాల్లో పోలీస్‌పాత్రల్లో మనోహర్‌నాయుడు నటించారు. ఈయన పోలీస్ ఉన్నతాధికారిగా నటించిన తమిళ సినిమా ఇంకా రిలీజ్‌కాలేదు. ఏడాదిగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయనకు.. కొంతకాలంగా నోటి మాట లేదు. అయినా సరే.. చంద్రబాబును జైల్లో పెట్టినప్పుడు గంగాధరనెల్లూరులో టీడీపీ నేతలు చేపట్టిన దీక్షలో రోజూ వచ్చి ఐదారు గంటలు ఉండి వెళ్లేవారు. సోమవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. ఈయన మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని, జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ తదితరులు సంతాపం తెలిపారు.



మనోహర్‌నాయుడు (ఫైల్‌ఫొటో)

వంటగ్యాస్ అధిక ధరలకు విక్రయిస్తే కేసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 28: వంటగ్యాస్ సిలిండర్లను బిల్లులో సూచించిన మొత్తం కంటే అధికంగా వసూలు చేస్తే.. అలాంటి డీలర్లపై చర్యలు తప్పవని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. దీనిపై జిల్లావ్యాప్తంగా పలువురు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. కొందరు డెలివరి బాయ్స్, గ్యాస్ ఏజెన్సీ యజమానులు గోడౌన్ నుంచి డెలివరి పాయింట్ దూరంగా ఉన్నందున రవాణా ఛార్జీల కింద అధిక మొత్తాలను వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఇలా వసూలు చేసేవారిపై డీఎస్వోకు లేదా టోల్ నెంబర్ 1967 లేదా 1800 23 33 555 నెంబరుకు ఫిర్యాదు చేయాలని జేసీ సూచించారు. గ్యాస్ సిలిండర్ బరువు, సీల్‌పై అనుమానం వస్తే డెలివరి బాయ్ వద్ద ఉన్న తూకం పరికరాల ద్వారా సరిచూసుకునే హక్కు వినియోగదారులకు ఉందన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

చిత్తూరు, జనవరి 28: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఉదయం 10.30 గంటల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ స్పందనలో భాగంగా వినతిపత్రాలను స్వీకరిస్తామని ఎస్పీ రిషాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

టీటీడీ పాలకమండలిని భగవంతుడు క్షమించడు

సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 28: టీటీడీ యాజమాన్యాన్ని, పాలకమండలిని భగవంతుడు కూడా క్షమించడని సీపీఐ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. టీటీడీ అటవీ కార్మికుల రెండో రోజు నిరవధిక దీక్షలో ఉన్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళిని, కార్మికులను ఆయన పరామర్శించి, రెడ్ సెల్యూట్ చేశారు. 1,159రోజులుగా టీటీడీ అటవీ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే టీటీడీ యాజమాన్యం ఏం చేస్తోందని ప్రశ్నించారు. కరుణాకరరెడ్డి లాంటి వ్యక్తి టీటీడీ చైర్మన్‌గా ఉన్నా ఆమరణ నిరాహారదీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందంటే పరిస్థితి ఏపాటిదో అర్థమవుతోందన్నారు. తక్షణం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అటవీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి పోరాటం, అధికార పార్టీ అవకాశవాదం తదితర అంశాలతో సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు పాడిన ఉయ్యాల-ఉయ్యాల పాట ఆకట్టుకుంది. అంగన్వాడీ యూనియన్ నేత నాగరాజమ్మ ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, గొబ్బెమ్మ పాటలను దీక్షా శిబిరం ఎదుట ప్రదర్శించారు. చంద్రశేఖర్ భాగవతార్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళాకారులు కచేరి నిర్వహించారు. రమాదేవి హాస్పిటల్ తరఫున వైద్యులు, సిబ్బంది శిబిరం వద్దకు చేరుకుని దీక్షలో ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రహ్మణ్యం, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యం ఆందోళనకరం

టీటీడీ అటవీ కార్మికులకు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టిన కార్మిక నేతలు కందారపు మురళి సహా కార్మికుల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని డాక్టర్ కిషోర్ ప్రకటించారు. ఆదివారం రాత్రి వైద్య పరీక్షలు నిర్వహించిన ఆయన షుగర్ లెవల్స్ పడిపోయాయని, బీపీ ఆందోళనకరంగా ఉందని తెలిపారు. తమ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉన్నా దీక్షలు విరమించేది లేదని, సమస్య పరిష్కారమయ్యే కొనసాగిస్తామని భీష్మించారు.

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపుపై కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 28: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23 మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లా నుంచి, 15 మందిని కడప జిల్లా నుంచి.. వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వస్తున్న వారికి జిల్లాలో పోస్టింగ్స్ ఇవ్వడంపై జిల్లాపరిషత్ యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్తున్న వారిని విధులనుంచి రిలీవ్ చేసేందుకోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్‌కు ఫైళ్లు పంపేందుకు జడ్పీ కార్యాలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కలెక్టర్ ఆమోదించిన తర్వాత ఈనెల 30వ తేదీలోపు బదిలీ అయిన ఎంపీడీవోలను జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి రిలీవ్ చేయనున్నారు. ఆ తర్వాత నెల్లూరు, కడప జిల్లాల నుంచి బదిలీపై రానున్న ఎంపీడీవోలకు ఉమ్మడి చిత్తూరుజిల్లా పరిధిలోని 65 మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్స్ ఇస్తారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే విధులు నిర్వహించనున్నారు.

శారదపీఠం భవన నిర్మాణాలు నిలిపేయాలి



కరపత్రం చూపుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 28 : తిరుమలలో విశాఖ శారదాపీఠం చేపట్టిన సెవెన్‌స్టార్ బిల్డింగ్ అక్రమ నిర్మాణం నిలిపివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీరుగట్టు నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కట్టడాలు చేపట్టడం బాధాకరమన్నారు. హైకోర్టు అడ్వకేట్ కమిషనర్‌ను పంపడం తిరుమల చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. సనతాన ధర్మాలను, హిందూ సంప్రదాయాలను కాపాడుతూ భగవంతుడి దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందించాల్సిన కొన్ని పీఠాలు టీటీడీ నిబంధనలు పాటించకుండా రాజకీయ పలుకుబడితో ఇష్టానుసారంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. టీటీడీ వ్యవస్థను ఉద్యోగులు తప్పుదారి పట్టిస్తున్నారని, తక్షణమే ఈ అక్రమ భవనాలను తొలగించాలని, లేకపోతే భక్తులతో కలిసి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు బొంతల రాజేష్ రాయల్, వెంకటా చలపతి, కోడివాక చందు, కందనూరు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి కొత్త కలెక్టర్‌గా లక్ష్మీషా

హౌసింగ్ ఎండీగా వెంకటరమణారెడ్డి



తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ జి.లక్ష్మీషా నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈ మార్పులు జరిగాయి. ప్రస్తుత కలెక్టర్ వెంకరమణారెడ్డి.. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులు కానున్నారు. ఇపుడు ఎండీగా ఉన్న లక్ష్మీషా ఇక్కడికి కలెక్టర్‌గా రానున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మీషా కర్ణాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలోని మారుమూల గ్రామమైన హోలుగుండనహళ్లికి చెందినవారు. సివిల్స్‌లో తొలుత ఐఎఫ్‌ఎస్‌కు ఎంపికై హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో పనిచేశారు. తర్వాత 2013లో మరోసారి సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించి ఏపీ కేడర్ ఎంచుకున్నారు. కర్నూలులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న లక్ష్మీషా కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆపై పార్వతీపురం ఐటీడీఏ పీవోగానూ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్నారు.

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు సమావేశమై అజెండా అంశాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ధార్మిక సదస్సుతోపాటు ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి ఏర్పాట్లపై చర్చించనున్నారు. అలాగే తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రకాల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈవిషయాన్ని టీటీడీ గోప్యంగా ఉంచింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని

ఇద్దరు శ్రీవారి భక్తుల దుర్మరణం



వరదన్ మృతదేహం

నారాయణవనం, జనవరి 28: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు శ్రీవారి భక్తులు దుర్మరణం చెందిన ఘటన నారాయణవనం మండలం రాళ్లకాలవ వద్ద ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్ఐ పరమేష్ నాయక్ కథనం మేరకు.... తమిళనాడుకు చెందిన మోహన్, వరదన్ శ్రీవారి దర్శనం కోసం కాలినడకను తిరుమలకు బయలుదేరారు. ఆదివారం ఉదయం నారాయణవనం మండలం రాళ్లకాలవ వద్ద వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్ అక్కడికక్కడే మృతి చెందగా, వరదన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని స్థానికులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఊరొదిలి వెళ్లినా ఓటర్లే


● జాబితాలో మృతుల పేర్లూ యథాతథం



ఊరువిడిచి వెళ్లినా ఎల్లంకివారిపల్లెలో ఓటర్లే


కల్లూరు, జనవరి 28: పులిచెర్ల మండలంలోని ఓటర్ల జాబితాను పరిశీలించే కొద్దీ కుప్పలు తెప్పలుగా తప్పులు వెలుగుచూస్తున్నాయి. తుది ఓటర్ల జాబితాలోనూ చాలావరకు తప్పులు యథాతథంగా ఉన్నాయి. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి 257 పోలింగ్‌స్టేషన్‌లో 30 ఏళ్ల కిందట ఊరువిడిచి వెళ్లిన ఓటర్లు సైతం జాబితాలో ఉన్నారు. సీరియల్ నెంబరు 398 హరినాథ్, 399 ఆర్‌డి కుమార్, 401 కె.లత, 402 మంజునాథ్.. వీరి కుటుంబం 30 ఏళ్ల కిందట తమిళనాడు రాష్ట్రం వేలూరుకు వెళ్లిపోయారు. అయితే ఓటర్ల జాబితా నుంచి ఈ పేర్లను తొలగించకోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

మృతులకూ ఓట్లు



దేవళంపేట పంచాయతీలోని 242 పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఏళ్ల కిందట చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు.సీరియల్ నెంబరు 351లోని ఇనుకులవారిపల్లికి చెందిన తులసీరాం రెండేళ్ల మృతి చెందాడు. సీరియల్ నెంబరు 410లోని రెడ్డివారిపల్లికి చెందిన వెంకటాచలం మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. సీరియల్ నెంబర్లు 661, 674లోని కొక్కువారిపల్లికి చెందిన సఫియాబి, గౌస్ సాహెబ్ రెండేళ్ల క్రితం మృతి చెందారు.సీరియల్ నెంబర్లు 824, 830లోని బెస్తపల్లికి చెందిన యోగానంద్, గోపాలయ్య రెండేళ్ల క్రితం మరణించినా జాబితా నుంచి ఆ పేర్లను తొలగించలేదు.

ఊరొదిలి ఇరవై ఏళ్లయినా ఓటరే..!



ఏళ్ల క్రితం ఊరొదిలి వెళ్లినా ఓటరుగానే...

వెదురుకుప్పం, జనవరి 28: తుది ఓటర్ల జాబితాలో ఊరు వదిలి వెళ్లి ఏళ్లు గడిచినా ఓటరుగానే ఉన్నారు. వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం జడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్ర పరిధికి సంబంధించి పచ్చికాపల్లంపేట గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి(63) ఊరు వదిలి వెళ్లిపోయి ఇరవై ఏళ్లు గడుస్తున్నాయని స్థానికులు తెలిపారు. కానీ, అతడికి క్రమసంఖ్య-282తో ఇంటి సంఖ్య-3-5తో తాజా జాబితాలో ఓటు ఉంది.

రెండు పంచాయతీల్లోనూ ఓటర్లుగా దంపతులు



కావేటిగారిపల్లి, మంగళంపేట పంచాయతీల్లో 15 ఏళ్లుగా ఓ దంపతులు ఓటర్లుగా కొనసాగుతున్నారు. కావేటిగారిపల్లి పంచాయతీ 262 పోలింగ్‌స్టేషన్ పరిధిలోని కమలాపురానికి చెందిన సీరియల్ నెంబర్లు 132, 135లోని కే సురేంద్ర, కే నీల దంపతులు. ఈ దంపతులు 15 ఏళ్ల క్రితం మంగళంపేటలో స్థిరపడ్డారు. మంగళంపేట 251 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్లు 23, 24లో నీలావతి, సురేంద్రగా ఓటర్ల జాబితాలో ఉన్నారు. అయితే కావేటిగారిపల్లి పంచాయతీలోనూ వీరు ఓటర్లుగా కొనసాగుతున్నారు.

వెలుగుచూస్తున్న డబుల్ ఎంట్రీలు



మతుకువారిపల్లి పంచాయతీలోని 233 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబర్ 616 నితీష్‌రెడ్డి డీఎస్‌ఏ తండ్రిపేరు డీఎస్‌ఏ సుధాకర్‌రెడ్డి రెడ్డి డీఎస్‌ఏ జ్యోతిగా ఉంది. ఇదే పోలింగ్ స్టేషన్‌లో సీరియల్ నెంబరు 617లో నితీష్‌రెడ్డి దిగువసదుం తండ్రిపేరు సుధాకర్‌రెడ్డి దిగువసదుంగా ఓటర్ల జాబితాలో నమోదైంది. ఒకే జాబితాలో డబుల్ ఎంట్రీని తొలగించడంలో అధికారులు విఫలమయ్యారు.

మెట్టినింటికెళ్లినా పుట్టింట్లో తొలగని ఓట్లు



ఎల్లంకివారిపల్లి పంచాయతీలోని 257 పోలింగ్‌స్టేషన్ పరిధిలో సీరియల్ నెంబరు 33లోని ఎల్లంకివారిపల్లికి చెందిన దివాకర్ కుమార్తె మాధురికి ఏడేళ్ల కిందట కేవీపల్లె మండలానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇదే గ్రామంలోని సీరియల్ నెంబరు 666 ఉన్న రమేష్ కుమార్తె ప్రశాంతికి 2017లో తిరుత్తణికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. అయినా, వీరిద్దరి పేర్లను ఇక్కడి ఓటర్ల జాబితా నుంచి తొలగించలేదు.

నియంతృత్వ పోకడలతో విద్యారంగం నిర్వీర్యం

● మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 28: కార్పొరేట్ రంగానికి కొమ్ముకాసి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పాలకులకు ఉద్యమాలతో సమాధానం చెబుతామని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హెచ్చరించారు. చిత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేవరాజులు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల రూపాయలతో పాఠశాలలను ఉద్ధరించామని చెబుతున్న ప్రభుత్వ పెద్దలు.. వీటిలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో చెప్పాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరించి, ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడం సరికాదన్నారు. ఆంగ్ల మాధ్యమంతో పాటు, తెలుగు మాధ్యమాన్నీ కొనసాగించాలన్నారు. ఉత్తుత్తి పీఆర్‌సీ కమిటీల పేరుతో మభ్యపెట్టడం మానుకోవాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు ఇప్పటి వరకు సర్వీసు రూల్స్ అమలు చేయలేకపోవడం దారుణమని విమర్శించారు. సమగ్రశిక్ష, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి చొరవచూపాలన్నారు. అంతకు ముందు ఎస్టీయూ సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర నాయకులు నాగేశ్వర్‌రావు, రఘునాథరెడ్డి, గంటా మోహన్, పురుషోత్తం, హేమచంద్రారెడ్డి, లోకనాథ్, మధన్‌మోహన్, గురుకుమార్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా మదన్‌మోహన్

జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎన్.ఆర్.మదన్‌మోహన్‌రెడ్డి (యాదమరి), ప్రధాన కార్యదర్శిగా బి.మోహన్(పుంగనూరు), ఆర్థిక కార్యదర్శిగా టి.యువరాజ్ (కార్వేటినగరం), అసోసియేట్ అధ్యక్షులుగా రమణారెడ్డి, చిట్టిబాబు, చంద్రన్, సుబ్రమణ్యం, అదనపు ప్రధాన కార్యదర్శులుగా అమర్నాథ్‌రెడ్డి, కిషోర్, చెంగల్‌రాయల్, విజయలక్ష్మి, పవన్‌కుమార్, బొబ్బిలి, ఉపాధ్యక్షులుగా జ్యోతీశ్వరుడు, సుమతి, శ్రీనివాసులు, మోహన్, కమలాపతి, రాజా, పరదేశి, వాసు, కార్యదర్శులుగా హరినాథ్, కన్నయ్య, లక్ష్మీదేవి, ఫణి, వనిత, ఉషారాణి, పురుషోత్తం, చంద్రశేఖర్, కోదండయ్య, చైతన్య, వెంకటరత్నం, ఆంజనేయులు, ఆర్థిక కమిటీ సభ్యులుగా సూర్యకుమార్, శ్రీనివాసులు, ధనరాజ్, నాగరాజు, జనార్దన్, మహిళా కన్వీనర్‌గా జి.అనిత, మైనారిటీ కన్వీనర్‌గా యాసిన్ షరీఫ్, సీపీఎస్ కమిటీ కన్వీనర్‌గా భాస్కర్‌రాజు, ఉపాధ్యాయ కన్వీనర్‌గా సర్దార్, ప్రచార కమిటీ కన్వీనర్‌గా ప్రసాద్, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా మంజుల, రాష్ట్ర కౌన్సిలర్లుగా గంటా మోహన్, దేవరాజురెడ్డి, పురుషోత్తం, జగన్మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, జయరామప్ప, ఇలియాస్ బాషా, హేమచంద్రరెడ్డి, రమేష్‌కుమార్, శ్రీదేవి, జనార్ధన్‌రెడ్డిని ఎన్నుకున్నారు.



ఎస్టీయూ నూతన కార్యవర్గం

అధికార దుర్వినియోగంతో వ్యవస్థలు నాశనం

మాజీమంత్రి అమరనాథరెడ్డి



అమరనాథరెడ్డికి మంగళహారతులు పడుతున్న మహిళలు

పెద్దపంజాణి, జనవరి 28: సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడి వ్యవస్థల్ని నాశనం చేశారని మాజీమంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. ఆదివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన పెద్దపంజాణి మండలంలోని బొమ్మరాజుపల్లె, వలసపల్లె, కుంట్లకింద, అమ్మరాజుపల్లె, వడ్డూరు. ముదరంపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ అవినీతిని ఎండగట్టారు. ఆయన మాట్లాడుతూ అవగాహనలేని వ్యక్తులకు అధికారం కట్టబెట్టడంతో రాష్ట్రం అంధకారంలోకి పోయిందన్నారు. కొత్తపరిశ్రమలు రాకపోగా ఉన్న పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్ళగొట్టారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు. అప్పు చేస్తే తప్పా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకువచ్చారన్నారు. నాడు-నేడుతో గోడలకు రంగులేసి కోట్లరూపాయలు దండున్నారన్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన మీరు సిగ్గుతో తలవంచుకునే రోజు దగ్గరలో ఉందన్నారు. అనంతరం ముదరంపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, సి.సుబ్రమణ్యం, శంకర్, గంగాధర్, వెంకటరత్నం, కృష్ణప్ప తదితరులు టీడీపీలో చేరారు. మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, నాయకులు మురహరిరెడ్డి, నాగరాజరెడ్డి, శివాడి నాగరాజ, గంగప్ప, వేమారెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, ముబారక్‌తాజ్, రెడ్డెప్పరెడ్డి, హరినాథరెడ్డి, గణపతి, జయరాంరెడ్డి, శ్రీరాములు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి చిత్తూరులో ఏడు ఉత్తమ హరిత పాఠశాలల ఎంపిక

స్టేట్ కో-ఆర్డినేటర్ నీలకంఠయ్యకు జాతీయ అవార్డు



నీలకంఠయ్య

తిరుపతి(విద్య), జనవరి 28: ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్(ఢిల్లీ) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉత్తమ హరిత పాఠశాలలుగా 7 హైస్కూల్స్ ఎంపికయ్యాయి. రాష్ట్రంలో 3,450స్కూల్స్ నమోదు చేసుకుని, ఇప్పటివరకు 900కిపైగా గ్రీన్ ఆడిటింగ్‌ను సమర్పించినట్లు గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.నీలకంఠయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఉత్తమ హరిత విభాగంలో 12 స్కూల్స్ ఎంపికవగా..అందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏడు ఉన్నట్లు వివరించారు. కాగా ల్యాండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో వాల్మీకిపురం మండలంలోని గండబోయినపల్లె జెడ్పీహెచ్‌ఎస్ అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రోగ్రామ్‌ని క్షేత్రస్థాయిలో ముందుకు తీసుకెళ్తున్న స్టేట్ కోఆర్డినేటర్, కరకంబాడి జెడ్పీహెచ్‌ఎస్ బయాలజీ టీచర్ పి.నీలకంఠయ్యను జాతీయ స్థాయిలో ఉత్తమ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేశారు. ఈనెల 30న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు, ధ్రువపత్రాలను అందిస్తారు. నీలకంఠయ్యను గ్రీన్‌స్కూల్ ప్రోగ్రామ్ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ అభినందించారు.

● ఉత్తమ హరిత విభాగంలో ఎంపికైన పాఠశాలలు : జెడ్పీహెచ్(గండబోయినపల్లె, వాల్మీకిపురం మండలం), జెడ్పీహెచ్‌ఎస్(మద్దిపాడు, గుర్రంకొండ మండలం), జెడ్పీహెచ్‌ఎస్(తవణంపల్లె), జెడ్పీహెచ్‌ఎస్(ఆర్‌కేఎంపురం, వెదురుకుప్పం మండలం), జెడ్పీహెచ్‌ఎస్(కల్లూరు), జెడ్పీజీహెచ్‌ఎస్(నారాయణవనం), జెడ్పీహెచ్‌ఎస్(పాలమంగళం).

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

వివాహిత మృతిపై నిరసన

● వరకట్న వేధింపుల కింద కేసు నమోదు

● హత్య కేసుగా నమోదు చేయాలని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయింపు



స్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన ప్రదర్శన చేస్తున్న మృతురాలి బంధువులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 27: వివాహిత ఆత్మహత్యకు సంబంధించి హత్య కేసు నమోదు చేయాలని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం నిరసనకు దిగారు. స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ మహేశ్వర్‌రెడ్డి వారితో చర్చించి, నచ్చజెప్పి వరకట్న వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్టు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, మలర్మతి కుమారుడు ధనరాజ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కర్ణాటక రాష్ట్రం, కొప్పల్ జిల్లా గంగావతికి చెందిన రామన్ కుమార్తె జ్యోతిక (23)ను ఒకటిన్నర సంవత్సరం క్రితం పెళ్లి చేసుకున్నాడు. అశోక్‌నగర్‌లోనే నివాసముంటున్నారు. శనివారం రాత్రి భర్తతో జరిగిన చిన్నపాటి గొడవ కారణంగా ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి తలుపు గొళ్లెం పెట్టుకుంది. ఎంతకీ తలుపు తీయకపోవడంతో భర్త ధనరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి గడ్డపారతో తలుపులు పగులగొట్టి చూడగా జ్యోతిక ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. ఆమెను కిందికి దించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు రుయాకు తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు ఆమె భర్తను విచారించగా బీటెక్ చదివిన జ్యోతిక ఉద్యోగం చేస్తానని అడగడంతో నిరాకరించానని, దీంతో ఆత్మహత్యకు పాల్పడిందని వివరించారు. మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. శనివారం రాత్రి తిరుపతికి చేరుకున్న జ్యోతిక తల్లిదండ్రులు, బంధువులు ఆమె ఇంటికెళ్లి వివరాలు తెలుసుకుని వేకువజామున ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. వరకట్నం కోసం వేధించడమే కాకుండా తమ కుమార్తెను హత్య చేశారంటూ భర్త, కుటుంబ సభ్యులపై హత్యకేసు నమోదు చేయాలని కోరారు. ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి వారితో చర్చించారు. వివాహ సమయంలో ధనరాజ్‌కు 10 తులాల బంగారు కట్నకానుకల కింద అందజేశామని, ఉద్యోగం లేకపోవడంతో పెళ్లైన ఆరు నెలల తర్వాత వ్యాపారం నిమిత్తం నాలుగు లక్షల రూపాయలు ఇవ్వాలని అడగడంతో ఇచ్చామని జ్యోతిక తండ్రి రామన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. మళ్లీ మరో ఐదు లక్షల రూపాయలు తీసుకురావాలని కొన్నాళ్లుగా తమ కుమార్తెను ధనరాజ్, ఆయన కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని, ఆ వేధింపులు తాళలేకే ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు భర్త ధనరాజ్, ఆయన తల్లిదండ్రులు, సోదరిపై 304బి. 398ఎ వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు.

పవిత్ర మృతిపై వీడిన మిస్టరీ...!

పథకం ప్రకారమే హత్య ● నీటిలో ముంచి కడతేర్చిన భర్త

శ్రీకాళహస్తి, జనవరి 28: శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో అనుమానాస్పదంగా మృతిచెందిన పవిత్ర ఘటనలో మిస్టరీ వీడింది. వివరాల్లోకి వెళితే... వరదయ్యపాళెంకు చెందిన లారీ డ్రైవర్ శ్రీనివాసులు(55), భార్య పవిత్ర (36) తలపై దాడి చేసి గాయపరిచాడు. తిరుపతిలో చికిత్స పొంది 13రోజుల తర్వాత ఆమె డిశ్చార్జ్ అయింది. ముక్కంటి ఆలయం దర్శించుకుని ఇంటికి వెళదామంటూ ఈ నెల 26వ తేదీ శ్రీనివాసులు భార్యను శ్రీకాళ హస్తికి తీసుకొచ్చాడు. ఎలాగైనా భార్యను హతమార్చాలని పతకం వేశాడు. మాయ మాటలతో ఆలయం సమీపంలోని చిమ్మచీకట్లో నిర్మానుష్యంగా ఉండే స్వర్ణ ముఖి నదిలోకి తీసుకెళ్లాడు. నీటిలో ముంచి భార్యను హతమార్చినట్లు విశ్వసనీయ సమా చారం. ఆ తర్వాత ఆమెది సహజ మర ణంగా చిత్రీకరించేందుకు నీటిలో పడి భార్య చనిపోయిందంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. తొలి నుంచి అతడి ప్రవర్తన తెలిసిన కుటుంబ సభ్యులు మాత్రం శ్రీకాళహస్తి 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు కేసు నమో దు చేశారు. మృతురాలి మెడపై గాయాలు ఉన్నట్లు పోస్టుమార్టం సమ యంలో వైద్యులు గుర్తించారు. దాని ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో భర్తే చంపేసినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు పక్కా సమాచారం. త్వరలో అరెస్టు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

కాంగ్రెస్ సీనియర్ నేత రామచంద్రప్ప

శాంతిపురం, జనవరి 28 : వైఎస్ షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నేత రామచంద్రప్ప అన్నారు. ఆదివారం తుమ్మిశి రోడ్డులోని ఓ దుకాణంలో ఆయన కొంత మంది కాంగ్రెస్ నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్ రాజశేకర్‌రెడ్డి ఆశయాలను తనయుడు జగన్ నెరవేరుస్తారని ఆశతో రాష్ట్ర ప్రజలు గెలిపించారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత నీరు గార్చారన్నారు. మళ్లీ రాష్ట్రంలో రాజన్న పాలన రావాలంటే అది ఒక షర్మిలతోనే సాధ్యమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నేత బాబు ఉన్నారు.

'చంద్రబాబును ఓడిస్తామనే ప్రగల్భాలు సరికాదు'

రొంపిచెర్ల, జనవరి 28: రానున్న ఎన్నికల్లో పుంగనూరులో టీడీపీపై గెలిచి తర్వాత కుప్పానికి వెళ్లి మా పార్టీ అధ్యక్షుడు చంద్రబాబును ఓడించాలని చల్లాబాబు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సూచించారు. ఆదివారం చల్లా బాబు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీలో రోజురోజుకు గ్రూపు రాజకీయాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని చక్కబెట్టుకోకుండా కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. పుంగనూరులో టీడీపీ జెండా ఎగరం తథ్యమన్నారు. సమావేశంలో మండలపార్టీ అధ్యక్షుడు ఉయ్యాల రమణ, నాగార్జున నాయుడు, ఓబులేశ్వరరెడ్డి, రవికుమార్‌నాయుడు, అమరనాథరెడ్డి, షేక్ కరీముల్లా, హయద్‌బాషా, హరిబాబు ఉన్నారు.

అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలి



ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ

సోమల, జనవరి 28: ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానంగా గ్రామాల్లో సంచరిస్తే వారిని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ వెంకటనరసింహులు అన్నారు. ఆదివారం మండలంలోని రామకృష్ణాపురంలో ఆయన గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మద్యం, సారా అమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు ఐక్యమత్యంగా మెలుగుతూ స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఆన్‌లైన్ గేమింగ్స్ మోజులో పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

తగరాలతాండాలో తాగునీటి సమస్య పరిష్కారం



పైపులైను పనులను పరిశీలిస్తున్న సర్పంచు

రామకుప్పం, జనవరి 28: రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ తగరాతాండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి పాలకులు చర్యలు చేపట్టారు. గడప-గడపకు కార్యక్రమంలో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారంలో జాప్యంపై గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్సీ భరత్ తాగునీటి సమస్య పరిష్కారంకు వారికి హామీ ఇచ్చారు. ఇటీవల సర్పంచు రాజగోపాల్ గ్రామంలో కొత్త బోరును తవ్వించి, డైరెక్ట్ పైపులైను ద్వారా నీటి సరఫరాను ప్రారంభించారు. ఆదివారం ఇంటింటికి కొళాయి ఏర్పాటు కోసం 500మీటర్ల మేర పైపులైను ఏర్పాటు పనులను ఆయన వైసీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ప్రచారకార్యదర్శి కేశవరెడ్డితో కలిసి ప్రారంభించారు.

రూ. 11.77 కోట్ల ఆసరా చెక్కు అందజేత



వి.కోట, జనవరి 28: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం 1290 స్వయం సహాయక గ్రూపులకు ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ రూ. 11.77 కోట్ల చెక్కును సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీంఖాన్, లక్ష్మణ్‌రెడ్డి, వైసీపీ నేతలు సుభాష్ చంద్రబోస్, గోపిరెడ్డి, శ్రీరాములురెడ్డి, గౌస్, బాలగురునాథ్, కిషోర్‌గౌడు, మురళీ, ప్రతాప్‌రెడ్డి, కుమార్‌రాజా, దామోదరం పాల్గొన్నారు.

పాటల పోటీల విజేతలకు బహుమతులు



భైరెడ్డిపల్లె, జనవరి 28 : భైరెడ్డిపల్లెలో కళా తరంగిణి సంగీత, నృత్య శిక్షణా కేంద్రంలో ఆదివారం చిన్నారులకు పాటల పోటీలు నిర్వహించారు. పలువురు చిన్నారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని భక్తిపాటలు, జానపద, దేశభక్తి గేయాలు, సినిమాపాటల విభాగాల్లో చక్కగా గేయాలు ఆలపించారు. విజేతలుగా ఎంపికైన చిన్నారులకు విశ్రాంత సెరికల్చర్ అధికారి మునిరత్నం, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలందజేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళారంగంలో కూడా రాణించి తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఆరిస్టులు మస్తాన్, రాజగోపాల్, రాజశేఖర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

పుంగనూరు, జనవరి 28: పుంగనూరు మండలం నెక్కొంది అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.3.35 కోట్లతో నిర్మించిన కన్వెన్షన్ హాల్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. స్వామివారిని పెద్దిరెడ్డి, ఆయన సతీమణి స్వర్ణలత దర్శించున్నారు. ఇటుకనెల్లూరులో నూతనంగా నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ జ్ఞానభవన్, స్థానిక శాంతినగర్‌లో మసీదును ఆయన ప్రారంభించారు. బైపాస్‌రోడ్డులో రవాణా కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన చేసి సెట్ కార్యాలయం, మానవత స్వచ్ఛందసంస్థ, వాల్మీకి, బ్రాహ్మణసంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీ ఎస్.రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, ఆర్డీవో మనోజ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, జానపదకళల సంస్థ రాష్ట్ర ఛైర్మన్ కొండేటి నాగభూషణం, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, బోయకొండ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ముడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అమ్ము, డీటీసీ బసిరెడ్డి, ఎంపీఐ సుప్రియ, తహసీల్దార్ సీతారాం పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించండి



పొలానికి వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, నీటి మడుగు

సోమల, జనవరి 28: సోమల మండలం అడుసుపల్లె వద్ద పూర్వం నుంచి ఉన్న పొలాలకు వెళ్లే దారిలో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడంతో తమకు ఇబ్బందిగా ఉందని బాధిత రైతు నక్కా నరసింహులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమల నుంచి నంజంపేట వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి తమ పొలానికి దారి ఉండగా ఉద్దేశపూర్వకంగా కొందరు సిమెంట్ దిమ్మె కట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కరెంట్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్, మరోవైపు ఆరు మట్లు లోతుగల నీటి మడుగు ఉండటం వల్ల దారి సమస్య నెలకొందని చెప్పారు. తహసీల్దార్, విద్యుత్ ఏఈ, అధికారులకు వినతి చేసినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా దారిసమస్య పరిష్కరించాలని ఆయన కోరారు.

టీడీపీ నేతకు మాజీ మంత్రి అమర్ నివాళులు

పలమనేరు, జనవరి28 :మండిపేటకోటూరు గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ధనంజయగౌడు ఆదివారం చనిపోయారు. మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ధనంజయగౌడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ధనంజయగౌడు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టీడీపీ నాయకులు జగదీష్‌నాయుడు, హరి, గోపాల్‌నాయుడు, దామునాయుడు, గిరి, జగన్నాథం, చంద్రబాబు, బాలాజీ, మూర్తి, లింగయ్య, శేషాద్రి, గురు, మాజీ ఎంపీపీ గీత పాల్గొన్నారు.

గెస్తింపల్లెలో రక్తదాన శిబిరం

వి.కోట : గెస్తింపల్లెలో సంగం డెయిరీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది రోగులు ఈ శిబిరానికి హాజరవ్వగా, సభ్యులు 50 యూనిట్ల రక్తం దానం చేశారు. లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ సురేంద్రగౌడ, అధ్యక్షులు లోకేష్, కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి శబరీష్ పాల్గొన్నారు.

కోలాహలంగా ఎద్దుల పండుగ







పెద్దూరులో ఎద్దులను నిలువరిస్తున్న యువకులు, తిలకిస్తున్న జనం, బందార్లపల్లెలో పరుగులు తీస్తున్న ఎద్దును నిలువరిస్తున్న యువకులు

శాంతిపురం, జనవరి 28 : మండల పరిధిలోని 64 పద్దూరు గ్రామంలో ఆదివారం పశువుల పండగ కోలాహలంగా జరిగింది. ఉదయం పశువులను అలంకరించారు. ప్రధాన వీదుల్లో తోరణాలు కట్టి అక్కడ పశువులను పరిగెత్తించారు. ఈ పందెంలో మొదటి బహుమతి రూ. 50 వేలతో ప్రారంభించి చివరి బహుమతి రెండు వేల రూపాయల వరకు పెట్టి అలా సుమారు 70 బహుమతులు పెట్టడంతో భారీగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ స్థాయిలో ఎద్దులను పరుగు పందేనికి తీసుకు వచ్చారు. సమారు 500 ఎద్దులు దాక వచ్చాయి. భారీ స్థాయిలో జనం రావడంతో 64పెద్దూరు జనసంద్రంగా మారింది. బాజీలో నిలబడి ఎద్దులను నిలవరించేందుకు యువకులు పోటీపడ్డారు. వారిలో కొంత మందికి స్వల్ప గాయాలు అయినట్లు తెలిసింది.

రామకుప్పం : రామకుప్పం మండలం బందార్లపల్లెలో ఆదివారం ఎద్దుల పండుగ కోలాహలంగా జరిగింది. తొలుత గ్రామానికి చెందిన రైతులు తమ ఎద్దులను గ్రామంలో ఊరేగించి, స్థానిక గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన రైతులు తమ ఎద్దులను జనసమూహం మధ్య పరుగులు తీయించారు. వేగంతో దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించి, నిర్వాహకులు వాటికి కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీలు పడ్డారు. ఎద్దులను నిలువరించి, లుంగీలను చేజిక్కించుకున్న యువకుల ఆనందోత్సాహాలతో కేరింతలు కొడుతూ నృత్యాలు చేశారు.

సోమల : సోమల మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పశువుల పండుగను కోలాహలంగా జరుపుకొన్నారు. సూరయ్యగారిపల్లె, అన్నెమ్మగారిపల్లె, వడ్డిరామాపురం, రామకృష్ణాపురం తదితర గ్రామాల్లో పశువులను సుందరంగా రకరకాల పుష్పాలు, బెలూన్‌లతో అలంకరించి పూజలు జరిపారు. పశువుల పాకల వద్ద గోపూజలు జరిపారు. అలాగే పెద్దఉప్పరపల్లె కాటమరాజు ఆలయం వద్దకు మహిళలు ఊరేగింపుగా బోణాలు, దీలు తీసుకుని వచ్చి అభిషేక పూజలు జరిపారు. సూరయ్యగారిపల్లె వద్ద పశువులను చిట్లా కుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అలాగే పేరంటాళ్లమ్మ ఆలయం వద్ద నడింపల్లెకు చెందిన బాలన్నగారి కుటుంబసభ్యులు అమ్మవారికి అభిషేక పూజలు జరిపించారు. అనంతరం జంతుబలులు చేసి అన్నదానం నిర్వహించారు.

వి.కోట: వి.కోట మండలం ఏడుచుట్లకోటలో ఆదివారం ముదరందొడ్డి సర్పంచ్ దామోదర్ నేతృత్వంలో గ్రామస్థులు పశువులకు పరుగు పందెం నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో పశువులను పరుగులు పెట్టించేందుకు అందరూ ఉత్సాహం చూపారు. పరుగులు పెడుతున్న కొడెగిత్తలను నిలువరించేందుకు యువకులు సాహసాలు చేశారు. ప్రతిభ కనబరచిన పశువులకు నిర్వాహకులు బహుమతులు అందించారు.





సూరయ్యగారిపల్లె వద్ద చిట్లాకుప్ప మంటలు, ఏడుచుట్లకోటలో పశువులకు నిరువరిస్తున్న యువకులు

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి : ఎమ్మెల్సీ కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, జనవరి 28: తెలుగుదేశం పార్టీతోనే బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం గుడుపల్లెలో టీడీపీ నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన మాట్లాడుతూ..వైసీపీ ప్రభుత్వం బీసీలకు పదవులు ఇచ్చి పెత్తనం మాత్రం అగ్ర వర్ణనేతలే చెలామణి సాగిస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయంలో బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి దోహదపడిందన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించిన వారు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఇచ్చింది టీడీపీయేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు చేసింది ఏమిలేదన్నారు. కార్యక్రమంలో కుప్పం టీడీపీ ఇన్‌ఛార్జి పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్ బాబు, మండల అధ్యక్షుడు బాబునాయుడు, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సాధికార ఛైర్మన్ మునిరాజు, చంద్రశేఖర్, మండల జనసేన అధ్యక్షుడు అమీర్, నేతలు మాజీ ఎంపీపీ వెంకటేష్, శాంతారామ్, శ్రీనివాసులు, హేమాంబర్ గౌడు, బేటప్ప నాయుడు, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, ప్రేమకుమార్, గోపినాథ్, ఉదయ్ కుమార్, విశ్వనాథంనాయుడు, నాగరాజు, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ వెంకటేశ్ మనుమరాలు యశస్విని కూచిపూడి, భరతనాట్య ప్రదర్శించగా నాయకులు, ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

ఘనంగా పీపీఎస్ వార్షికోత్సవం

పలమనేరు, జనవరి 28 : పలమనేరు పరిరక్షణ సమితి 7వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు సుబ్రమణ్యం పిళ్లై సమితి చేసిన సేవా కార్యక్రమాలను సభ్యులకు వివరించారు. సమితి గౌరవాధ్యక్షుడు ఆనంద బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కొంత సమయం, కొంత ఆదాయం సేవా కార్యక్రమాలకు కేటాయిస్తే జీవన సాఫల్యత లభిస్తుందన్నారు. అనంతరం పలురంగాల్లో విశిష్ట సేవలందించిన డాక్టర్లు మాధవి, రాజారెడ్డి, సుశీల, ఫారెస్టు రేంజర్ శివన్న, పయని, గిరిప్రసాద్, కె. లక్ష్మీప్రసన్న, కిషోర్‌నాయక్, శంకరమ్మ, విద్యాసాగర్, వళ్లెమ్మ, శేఖర్, వేణుగోపాల్, అఫ్రోజ్‌లకు జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరసింహులు, సమితి సభ్యులు విజయకుమారరెడ్డి, దేవరాజులు, పొన్నుడి, నారాయణ, విజయకుమార్, సుబ్రమణ్యం, సుధాకర్, రెడ్డెప్ప, దేవా, దొరస్వామి, శేఖర్, సాంబయ్య, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సమితి అధ్యక్షుడు సుబ్రమణ్యంపిళ్లై



బహుమతుల ప్రదానం

పలమనేరు ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా పుత్తూరు యువకులు, రన్నర్స్‌గా పలమనేరు యువకులు నిలిచారు. ఈ సందర్భంగా వారిని నవీన్ అభినందించడంతోపాటు విన్నర్స్ రన్నర్స్‌కు నగదు ప్రోత్సాహకాలను కూడా అందజేశారు. - పలమనేరు



ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా నిలిచిన పుత్తూరు యువకులు, రన్నర్స్‌గా నిలిచిన పలమనేరు యువకులు

తులసినాథం నాయుడికి సన్మానం



పలమనేరు, జనవరి 28 : తెలుగు భాషకు విశిష్ట సేవలందిస్తున్న తెలుగు సాహిత్యసాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథం నాయుడిని ఆదివారం కర్ణాటకరాష్ట్రం కేజీఎఫ్‌లో అక్కడి తెలుగు కళాసమితి వారు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా తులసినాథం నాయుడు మాట్లాడుతూ తెలుగుభాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక నాయకులు యుగంధర్‌బాబు, గిరిధరమూర్తి, వండర్‌సైన్సు ప్రదర్శన నిర్వహించి సభికులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచారు. వారిని కూడా తెలుగు కళాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఈశ్వరప్రసాద్, జనార్ధనరావు సన్మానించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, జనవరి28 : గడ్డూరులో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధసేవాసమితి ఇందుజ్ఞానవేదిక సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక పలమనేరు, బంగారుపాళ్యం కమిటీ అధ్యక్షులు డి.బాలాజీ, భాస్కర్, సభ్యులు రాజేంద్ర, వాణిశ్రీ, జ్యోతి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం : వేమన పద్యాలపై శివరామపురం త్రైత సిద్ధాంత - ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ సభ్యులు ఆదివారం కదిరిఓబనపల్లె, కనమలదొడ్డి, కాళిగానూరు గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు క్రిష్ణమూర్తి, దిలీప్, రంగప్ప, రాణెమ్మ, విమలమ్మ, సుకన్య, దివాకర్ పాల్గొన్నారు.

80 మందికి కంటి పరీక్షలు

గంగవరం, జనవరి 28 : స్థానిక లయన్స్ క్లబ్‌లో ఆదివారం దివంగత వేమల లక్ష్మయ్య శెట్టి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు పీఈఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 80 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా, వారిలో 16 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేసినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘు, సభ్యులు వీరబద్రయ్య, శ్రీరాములుశెట్టి, చంద్రయ్యశెట్టి, సత్యనారాయణ, దివాకర్, డాక్టర్ రాజారెడ్డి, రమేష్‌కుమార్, జయశంకర్, పుగలేంది, హేమకుమార్ లతోపాటు పీఈఎస్ వైద్యులు పాల్గొన్నారు.

రైతులకు సోలార్ విద్యుత్ అందించాలి

చిత్తూరు సిటీ, జనవరి 28: ప్రభుత్వం రైతులకు సోలార్ విద్యుత్ అందించాలని రైతు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం చితూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి విద్యుత్ తప్పనిసరి కావడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని పెంచుకోవడానికి ప్రభుత్వం సోలార్ సిస్టం తీసుకురావడం అవసరమని చెప్పారు. తద్వారా ప్రభుత్వం విద్యుత్ కొనుగోలుకు చెల్లించే ఖర్చు తగ్గించడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో రైతు సంఘం నేతలు జయచంద్ర చౌదరి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

చిత్తూరు సిటీ, జనవరి 28: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే యూనియన్ తొలి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఎవరికైనా సమస్య వస్తే జిల్లా కార్యవర్గం దృష్టికి తీసురావాలని అన్నారు. యూనియన్ సభ్యులు తక్షణం స్పందించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తారని హామీ ఇచ్చారు. యూనియన్ నేతలు ప్రసాద్ రెడ్డిభాగ్యమేరి, శైలజ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పుంగనూరు మండల అధ్యక్షుడిగా మణి



పుంగనూరు రూరల్, జనవరి28: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కనుమకుంట మణిను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ నరసింహులు తెలిపారు. ఆదివారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడుగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల వెంకట్రమణలను ఎన్నుకున్నట్లు వివరించారు. సమావేశంలో సంఘనాయకులు వెంకటరమణ, ప్రభాకర్, రామనాథం, ప్రకాశ్, అమర, శ్రీనివాసులు, ప్రభు, గోవిందు, నారాయణ పాల్గొన్నారు.

దుకాణంలో చోరీ

పుంగనూరు రూరల్, జనవరి 28: పుంగనూరులోని మదనపల్లె రోడ్డు నాగిరెడ్డి పెట్రోల్‌బంక్ ఎదురుగా ఉన్న ఓ దుకాణంలో శనివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చొరబడి నిత్యావసర సరుకులు, సిగిరెట్లు చోరీ చేసినట్లు దుకాణ యజమాని దుర్వాసులురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి యధావిధిగా దుకాణం మూసి ఆదివారం ఉదయం దుకాణం వద్దకు రాగానే తాళాలు పగలగొట్టినట్లు తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చానన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణ తెలిపారు.

క్రీడా విజేతలకు బహుమతులు



పుంగనూరు రూరల్, జనవరి28: స్థానిక నారాయణ పాఠశాల ఆవరణలో ఆదివారం కుప్పం, వి.కోట, పలమనేరు, చిత్తూరు, పుంగనూరు పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలు నిర్వహించినట్లు నారాయణ పాఠశాల హెచ్ఎం సరిత తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం, కొండలరావు, ఏజీఎంలు ఫణిరవీంద్రకుమార్, కిషోర్, వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు పూజలు



చౌడేపల్లె, జనవరి28: బోయకొండ గంగమ్మ ఆలయం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం ఉదయాన్నే అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొల్పి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. రాష్ట్రమహిళా కమిషన్ సభ్యురాలు రోకియాబేగం అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

వెండి ఆభరణాల వితరణ



చౌడేపల్లె, జనవరి28: సత్యప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండ ఆంజనేయస్వామి ఆలయానికి దాత రావూరి గుణశేఖర్, డాక్టర్ రియ, తిరుపతి మంగళం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ షేక్ రోకియాబేగం కుటుంబ సమేతంగా స్వామి వారికి తమ మొక్కులను చెల్లించుకున్నారు. సుమారు రూ.45వేలు విలువ కలిగిన వెండి కిరీటం, కళ్లు, తదితర ఆభరణాలను స్వామి వారికి సమర్పించారు. ఈ సందర్భంగా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రసాద్, ప్రధాన అర్చకులు కృష్ణమూర్తి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి సత్కరించారు.

వరి నాట్ల జోరుతో మహిళా కూలీలకు డిమాండ్

సోమల, జనవరి 28: రబీ సీజన్‌లో వరినాట్లు జోరుగా సాగుతుండడంతో మహిళా కూలీలకు డిమాండ్ ఏర్పడింది. మండలంలో పలు గ్రామాల్లో వరి సాగుకు రైతులు సిద్ధం కావడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. మహిళా కూలీలు వరి నాట్లకు రోజుకు రూ. 600 వరకు సంపాదిస్తున్నారు. రైతులు పోటీలు పడడంతో కూలీల ధరలు పెరిగాయి. ఇతర పనులకు రూ.300 మాత్రమే ఇస్తున్నారు. వరి నాట్లకు మాత్రమే టిఫెన్, మధ్యాహ్న భోజనంతోపాటు రూ. 500 నుంచి రూ. 600 వరకు చెల్లిస్తున్నారు. మండలంలోని సోమల, నంజంపేట, కామిరెడ్డివారిపల్లె, కందూరు తదితర గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది.

మృతుల కుటుంబాలకు సాయం

రామకుప్పం, జనవరి 28: రామకుప్పం మండలం విజలాపురం, కోటచేను గ్రామాలకు చెందిన చౌడమ్మ, వెంకటప్పలు శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి పట్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు స్థానిక నేతలతో కలిసి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

టీడీపీ సీనియర్ నేతకు నివాళి

పుంగనూరు రూరల్, జనవరి28: మండలంలోని చంద్రమాకులపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శంకరాచారి మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్. శ్రీనాథరెడ్డి పేర్కొన్నారు. శంకరాచారి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి, దామోదర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సాయం

రామకుప్పం, జవనరి 28: విజలాపురంలో శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన చౌడమ్మ మృతదేహాన్ని ఆదివారం వైసీపీ మండల కన్వనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, ప్రచారకార్యదర్శి కేశవరెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు బర్కతుల్లాలు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు వారు రూ.10వేలు అందజేశారు.

చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం



బాబు నాయుడును సత్కరిస్తున్న గురుసాల కిషన్‌చంద్ తదితరులు

వెదురుకుప్పం, జనవరి 28: టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా, జీడీనెల్లూరు నియోజకవర్గానికి డాక్టర్ థామస్‌ను ఎమ్మెల్యేగా చేయడమే ఏకైక లక్ష్యమని ఆ పార్టీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు గాలి బాబు నాయుడు, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బట్టే చాణిక్యప్రతాప్ అన్నారు. ఆదివారం గాలి బాబు నాయుడును పార్టీ శ్రేణులు సన్మానించారు. టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, నాయకులు రజనీకాంత్ పాల్గొన్నారు.

మన చంద్రన్నకు చెబుదాం... అభివృద్ధి సాధిద్దాం



చంద్రన్నకు చెబుదాం కార్యక్రమంలో గ్రామస్తులతో చలపతి, లత

నగరి, జనవరి 28: మన చంద్రన్నకు చెబుదాం.. అభివృద్ధి సాధిద్దాం అంటూ ఒకటవ వార్డు మాజీ కౌన్సిలర్ లత, టీడీపీ నాయకుడు రామనుజం చలపతి పేర్కొన్నారు. టీడీపీ ఓట్ల బ్యాంకింగ్ పెంచడానికి ఆదివారం సామాలమ్మ అలయ ఆవరణలో చంద్రన్నకు చెబుదాం.. అభివృద్ధి సాధిద్దాం కార్యక్రమం చలపతి ఆధ్వర్యంలో నిర్వహించారు. నగరి మున్సిపాలిటీ 3వ వార్డులో ఆదిఆంధ్రవాడ గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ గ్రామ సమస్యలు, మీ సమస్యలు చంద్రన్నకు తెలియజేసి పరిష్కరించుకుందాం అని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలలో చంద్రబాబును సీఎంగా చేసేందుకు కృషి చేద్దామని లత పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందరమూర్తి, సుబ్బులయ్య, రాజేంద్ర, చిన్నబ్బ, అయ్యప్ప, గిరి, జానకీరామ్, ఆదెమ్మ పాల్గొన్నారు.

రైతులకు సోలార్ విద్యుత్ అందించాలి

చిత్తూరు సిటీ, జనవరి 28: ప్రభుత్వం రైతులకు సోలార్ సిస్టం ద్వారా విద్యుత్ అందించాలని రైతు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు కోరారు. ఆదివారం చితూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి విద్యుత్ తప్పనిసరి కావడంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని పెంచుకోవడానికి ప్రభుత్వం సోలార్ సిస్టం తీసుకురావడం ఎంతో అవసరమని చెప్పారు. తద్వారా ప్రభుత్వం విద్యుత్ కొనుగోలుకు చెల్లించే ఖర్చు తగ్గించడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర కల్పించే అవకాశం ఉందన్నారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోవడం తదితర సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో రైతు సంఘం నేతలు జయచంద్ర చౌదరి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన్నెకుల క్షత్రియ చిహ్నాం ఆవిష్కరణ

చిత్తూరు, జనవరి 28: గాంధీ రోడ్డులోని జిల్లా వన్నెకుల క్షత్రియ కుల సంఘ కార్యాలయంలో ఆదివారం వన్నెకుల క్షత్రియ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వన్నెకుల క్షత్రియ చిహ్నామైన అగ్నికలశం, జంబు మహర్షి వీరరుద్ర వన్నియర్ చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్పొరేటర్ శశికుమార్ మాట్లాడుతూ వన్నెకుల విద్యార్థులకు ఉచిత విద్య, పేదలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, కులపెద్ద కాశీనాయకర్, ఆ సంఘం రాష్ట్ర నాయకులు సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

చిత్తూరు సిటీ, జనవరి 28: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే యూనియన్ తొలి ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య చెప్పారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఎవరికైనా సమస్య వస్తే జిల్లా కార్యవర్గం దృష్టికి తీసురావాలని అన్నారు. యూనియన్ సభ్యులు తక్షణం స్పందించి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తారని హామీ ఇచ్చారు. యూనియన్ బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు. యూనియన్‌లో మెంబర్‌షిప్ తీసుకోనివారు వెంటనే తీసుకోవాలని అన్నారు. యూనియన్ నేతలు ప్రసాద్ రెడ్డిభాగ్యమేరి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

రానున్నది జనసేన, టీడీపీ ప్రభుత్వం

పాలసముద్రం, జనవరి 28: రానున్నది జనసేన, టీడీపీ ప్రభుత్వమేనని గంగాధరనెల్లూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని శ్రీకావేరిరాజుపురం, శ్రీకావేరిరాజుపురం ఆదిఆంధ్రవాడ, శ్రీకావేరిరాజుపురం కాలనీ, సీఎం కండ్రిగ గ్రామాల్లో జనం కోసం జనసేన, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి, రాబోవు ఎన్నికల్లో జనసేన, టీడీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, జనసేన నాయకులు లతీష్, వాసు నాయుడు, కోదండన్, పాల్‌రాజ్, శోభన్‌బాబు, చంద్రమౌళి, వెంకటేష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీరంగరాజపురం, జనవరి 28: ఎస్ఆర్‌పురం మండలం, పుల్లూరు క్రాస్ రోడ్డులో షిరిడీ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ గ్రామీణ పేదలకు గుండె జబ్బు, డయాబెటిస్, కీళ్ల నొప్పులు, దంత, కన్ను, గైనకాలజీ, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో సుమారు 2వేల మంది పైగా చికిత్స చేయించుకున్నారని తెలిపారు. ప్రజలకు అన్నదానం చేశారు. ఈ వైద్య శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, బోడపాటి లోకనాథ నాయుడు సందర్శించారు.

ఓటమి భయంతోనే దొంగ ఓట్లు: టీడీపీ

విజయపురం, జనవరి 28: ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దొంగ ఓట్ల నమోదును ప్రోత్సహిస్తున్నారని టీడీపీ చిత్తూరు పార్లమెంటు వెరిఫికేషన్ ప్రతినిధి వెంకటేసులు ఆరోపించారు. ఆదివారం పన్నూరు సబ్‌స్టేషన్‌లోని మండల టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అధికార పార్టీ నేతలు భయభ్రాంతులకు గురై ఉన్న వారి ఓటు తీసివేస్తూ లేని వారి ఓట్లను జాబితాలో చేర్పుతున్నారని, ఈ అంశమై ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, నాయకులు దశరథరాజు, గుణశేఖర్‌రెడ్డి, శివలింగం, మునిభాస్కర్‌రాజు, ముకుందరెడ్డి, సుధా నాయుడు, శరత్, బెంజిమన్, బాబు, సెల్వం, మురళీ, కపిల్, వరదరాజులు, మురళీనాయుడు, ఢిల్లీ నాయుడు, ఆర్ముగంరెడ్డి, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కరపత్రాల పంపిణీ

కార్వేటినగరం, జనవరి 28: కార్వేటినగరం మండలం కొలాగుంటలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న పలు పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు చెంగల్ రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, తిరుమలనాథ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నగరి, జనవరి 28: నగరి మండల పరిధిలోని నెత్తంకండ్రిగ గ్రామం చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం మధ్యాహ్నం పోలీసులు కనుగొన్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా వున్నాయి. 40 నుండి 50 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి కనపడిందన్నారు. ఈ మేరకు పోలీసులు ఏరియా వైద్యశాల సిబ్బందితో బాటు సంఘటనా స్థలికి వెళ్లి అక్కడే పోస్టుమార్టం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే బీసీలకు సమన్యాయం

- మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్



బీసీల ఐక్యత వర్ధిల్లాలని సంఘీభావం తెలుపుతున్న నాయకులు

తవణంపల్లె, జనవరి 28: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు సమన్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని కాణిపాకం క్రాస్‌లోని సీడీయం కల్యాణ మండపంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు వినాయకం ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బీసీలకు సముచిత స్థానం ఇచ్చింది టీడీపీనేనని చెప్పారు. బీసీల సంక్షేమం కోసం కార్పొరేషన్ ద్వారా పోత్సాహకాలను అందించి ఆర్థిక చేయూత కల్పించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. బీసీలకు రిజర్వేషన్ కుదించి అన్యాయం చేసిన జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కలిసి కట్టుగా కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా మండల ఈడిగ సంఘం అధ్యక్షుడు గుణశేఖర్‌గౌడ్‌ను టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీలు పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేష్ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు గాలి దిలీప్, మండల జనసేన అధ్యక్షుడు శివ, నేతలు వెంకటేష్ చౌదరి, మధుకుమార్, భాస్కర్, గోపి యాదవ్, సరళకుమారి, భాస్కర్ నాయుడు, మోహన్ నాయుడు, సునీల్ చౌదరి, టి.పుత్తూరు సర్పంచ్ రవిచంద్రారెడ్డి, జెట్టిపల్లె శ్రీనివాసులు, శరవణ, సుధాకర్ నాయుడు, లవకుమార్, ధనంజయ నాయుడు, దాము యాదవ్, మణి తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న కార్మిక బస్సు చైతన్య యాత్ర ప్రారంభం



బస్సు చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న థామస్

కార్వేటినగరం, జనవరి 28: కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలి వద్ద టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చంద్రన్న కార్మిక బస్సు చైతన్య యాత్రను గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ఆదివారం ప్రారంభించారు. బీడీ కార్మికుల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే సొంతమని థామస్ అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాగానే కార్మిక సంక్షేమ పథకాలన్నింటినీ నిలిపివేసిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీ అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, నాయకులు రవియాదవ్, జగన్నాథం, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జోయాలుక్కాస్‌లో ఆఫర్లను సద్వినియోగం చేసుకోండి



జోయాలుక్కాస్‌లో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య

చిత్తూరు సిటీ, జనవరి 28: జోయాలుక్కాస్‌లో ఆఫర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య చెప్పారు. ఆదివారం స్థానిక హైరోడ్డులోని జోయాలుక్కాస్ బంగారు నగల దుకాణంలో మజూరీపై 50 శాతం డిస్కౌంట్ ఆఫర్ బ్రోచర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారు, డైమండ్‌లు, సిల్వర్ నగలపై మజూరీలో 50 శాతం తగ్గిస్తున్న అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ అవకాశం ఫిబ్రవరి 18వ తేదీ వరకు ఉంటుందని షోరూం బ్రాంచ్ మేనేజర్ షనీశ్ యంబి తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఈడిగ, గౌడ కులస్తుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు, జనవరి 28: జిల్లాలో ఈడిగ, గౌడ కులస్తులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఏర్పడిందని గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజ్ అన్నారు. కట్టమంచి శివాలయంలో ఆదివారం సంఘం ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘ కార్యదర్శి మాట్లాడుతూ అగ్రవర్ణాలకు ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న ఈడిగ, గౌడ కులస్తులు రాజ్యాధికార దిశగాముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ నాయకులు వినోద్‌కుమార్, దీనదయాళ్ గౌడ్, తారక్ గౌడ్, రాజేష్, గురుస్వామి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

పెనుమూరు, జనవరి 28: పెనుమూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆసరా పథకంలో భాగంగా డ్వాక్రా మహిళలకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి చెక్కులు పంపిణీ చేశారు. సెర్ప్ హెచ్ఆర్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని హరిక్రిష్టారెడ్డి, ఇతర సిబ్బంది ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు కళావతి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, సర్పంచ్ జయచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

చిత్తూరు కల్చరల్, జనవరి 28: స్థానిక రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యులచే నిర్వహించిన వైద్య శిబిరానికి 186 మంది కంటి రోగులు హాజరు కాగా, వారిలో 86 మంది ఆపరేషన్లకు ఎంపిక అయ్యారు. వీరందరికీ చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ తెలిపారు. ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జతిం, జ్యోతి, ఎవంత్, కమలేష్, అమిత్ జైన్లు పాల్గొన్నారు. 19వ డివిజన్ సచివాలయం సమీపంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ప్రజలకు క్యాన్సర్, గుండె, రక్తపోటు, చక్కెరవ్యాధి, మూత్రాశయం, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ వ్యాధులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బి. వనిత, లోకేష్ భరణి తదితరులు పాల్గొన్నారు.

మనోహర్ నాయుడి మృతి టీడీపీకి తీరని లోటు

చిత్తూరు సిటీ, జనవరి 28: టీడీపీ తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాచిగుంట మనోహర్ నాయుడి మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తి నాని, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ, రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్రకుమార్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్, రాష్ట్ర తెలుగుమహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, కార్యనిర్వహక కార్యదర్శి సీఎం విజయ, మాజీ జడ్పీఛైర్మన్ గీర్వాణి చంద్రప్రకాష్, మాజీ మేయర్ కటారి హేమలత, పార్టీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు నాగేశ్వర రాజు, జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్ మనోహర్ నాయుడు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేశారని పేర్కొన్నారు. మనోహర్ నాయుడు మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని వారు ఆప్రకటనలో తెలిపారు.

వెదురుకుప్పం: మనోహర్ నాయుడి మృతి పట్ల గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్, వెదురుకుప్పం మండలానికి చెందిన టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు గాలి బాబు నాయుడు, పోటుగారి గంగయ్య, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బట్టే చాణిక్యప్రతాప్, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు చంద్రబాబురెడ్డి, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మరకాలకుప్పం సుధాకర్, బీఎం రవీ తదితరులు సంతాపం తెలిపారు.

కార్వేటినగరం: మనోహర్ నాయుడి మృతికి కార్వేటినగరం మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్ రాయల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, తెలుగు రైతు చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు నాగేశ్వరాజు, జనార్దన్ రాజు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నగరంలో వీఎన్ఆర్ విస్తృత పర్యటన

చిత్తూరు, జనవరి 28: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆదివారం 11వ డివిజన్‌లో పర్యటించారు. టూ వీలర్స్ అసోసియేషన్ నేతల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని వడ్డెర కుల సంఘ నేతలు విజయానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వడ్డెర సంఘం నాయకులు రవీంద్రరాజు, చందర్‌కుమార్, సుబ్రహ్మణ్యం, హరిబాబు, అయ్యప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.